www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -80 గురువారం19 జూన్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545




## రూ. 3వేలకే ఫాస్టాగ్
# వార్షిక పాస్

- వాహనదారులకు తీపికబురు.. కేంద్రం కీలక ప్రకటన!
- కేంద్రం నుంచి ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్ ప్రకటన
- ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి అమలు
- వార్షిక పాస్ ధర రూ.3000గా ఖరారు
- ఏడాది లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు
- కార్లు, , వ్యాన్ల వంటి నాన్-కమర్షియల్ వాహనాలకు వర్తింపు
- త్వరలో యాక్టివేషన్ లింక్ అందుబాటులోకి

2లో



## మధ్యవర్తిత్వం
# అబద్ధం..!

2లో

- వాణిజ్య ఒప్పందమూ వట్టిదే
- అమెరికాకు రావాలని కోరిన ట్రంప్
- ముందస్తు కార్యక్రమాల వల్లకుదరదన్న మోడీ
- క్వాడ్ సదస్సుకు మోడీ ఆహ్వానం ..

## పాక్ ప్రాధేయపడితేనే.. దాడులు ఆపాం..
### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో ఫోన్లో ప్రధాని మోడీ

**కననాస్కిస్ (కెనడా):** పాకిస్తాన్ ప్రాధేయపడితేనే ఆపరేషన్ సిందూర్ దాడులు ఆపామని, అంతే తప్ప ఎవ్వరి మధ్యవర్తిత్వంతో కాదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి స్పష్టం చేశారు. భారత్–పాక్ దేశాలు చేసుకున్న సీజ్ ఫైర్ ఒప్పందంలో అమెరికా ప్రమే యం ఎంత మాత్రమూ లేదని పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సిందూ ర్ ఇంకా కొనసాగుతున్నదని చెప్పిన మోడీ.. పాకిస్తాన్ బుల్లెట్లకు భారత్ బాంబులతో ప్రతిస్పందిస్తుందని అన్నారు. జీ7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు కెనడా వచ్చిన ప్రధాని మోడీ.. పలు వురు దేశాధినేతలతో సమావేశమయ్యారు. అయితే, తొలి సెషన్ సమ యంలోనే అమెరికాకు ట్రంప్ అర్ధాంతరంగా వెళ్లిపోవడంతో.. బుధ వారం ఫోన్ చేసి మరీ ట్రంప్ మోడీ సంభాషించారు. వీరి సంభాషణ దాదాపు 35 నిమిషాల పాటు కొనసాగింది. ఈ నేపథ్యంలో దాయాది దేశంతో కాల్పుల విరమణతోపాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఎటువంటి మధ్యవర్తిత్వం అంగీకరించలేదని, భవిష్యత్తో కూడాఅంగీకరించబోమని ట్రంప్కు మోడీ స్పష్టం చేశారు.



## మావోయిస్టులకు మరో
# ఎదురుదెబ్బ

**మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్..**

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అరుణ, అంజు అనే ముగ్గురు మావోలు మృతి

2లో

# బనకచర్లను ఆపేయాలి





- కేంద్రాన్ని కోరాలని అఖిలపక్షంలో తీర్మానం
- నేడు ఢిల్లీలో కేంద్రజలశక్తి మంత్రిని కలవనున్న సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- వెంట ఎంపిల బృందం అఖిలపక్షానికి హాజరైన బిజెపి, బిఆర్ఎస్,ఎంఐఎం పార్టీల ఎంపిలు
- రాజకీయ పోరాటంలో న్యాయంజరగకపోతే కోర్టుకు వెళ్దామన్న సిఎం
- సమావేశంలోరాజకీయాలు మాట్లాడారంటూ బిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు వాకౌట్

**హైదరాబాద్ జూన్18ప్రజావినికిడి,** బనకచర్ల ప్రాజెక్టును వెంటనే ఆపివేయాలని సచివాలయంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అఖిలపక్షం భేటీలో నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని సి.ఆర్ పాటిల్‌ను కలిసి ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో తనతో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి –బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈ ప్రాజెక్టును నిలుపుదల చేసేందుకు మూడు రకాలుగా ప్రయత్నాలు చేస్తామని సీఎం అన్నారు. మిగతాది 2లో...

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు



- రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల
- వ్యక్తిగత సంభాషణలు దొంగచాటుగా విన్నారన్న షర్మిల
- ఇది వ్యక్తిగత గోప్యతకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్య

2లో



## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్
## ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి
- నైపుణ్యాభివృద్ధికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్,జూన్18ప్రజావినికిడి,** హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు

మిగతాది 2లో....

## ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం

- సెల్‌ఫోన్ అప్పగించాలన్న ఏసీబీ నోటీసులపై స్పందించిన కేటీఆర్
- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనంపై తీవ్ర అభ్యంతరం
- ప్రాథమిక హక్కులు, గోప్యతకు భంగమంటూ లేఖ
- సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన మాజీ మంత్రి



2లో.

## నిబంధనల ప్రకారం పకడ్బందీగా
# గురుకులాల నిర్వహణ



డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

- -గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ సర్వీస్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- -గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి
- -ప్రతి గురుకులంలో తప్పనిసరిగా దోమల మెష్ జాలి ఏర్పాటు చేయాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రితో కలిసి సమీక్షించిన డిప్యూటీ సిఎం

6లో.

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్‌ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు

## రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల

**జూన్18ప్రజావినికిడి,**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు.

గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు.

# రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్

**న్యూఢిల్లీ, జూన్18ప్రజావినికిడి,**

జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఫాస్టాగ్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా వార్షిక పాస్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రైవేటు వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ముఖ్యంగా తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

**కేవలం రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్**

ఈ నూతన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. ఈ వార్షిక పాస్ పొందాలనుకునేవారు రూ.3000 చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాస్ యాక్టివేట్ చేసుకున్న నాటి నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే, అప్పటితో పాస్ గడువు ముగుస్తుంది. ప్రస్తుతం ఈ సౌకర్యం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర (నాన్-కమర్షియల్) వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని గడ్కరీ తన పోస్ట్‌లో వివరించారు.

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జాతీయ రహదారులపై ఈ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. పాస్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి త్వరలోనే ఒక ప్రత్యేక లింక్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఈ లింక్ 'రాజ్‌మార్గ్' యాప్‌తో పాటు ఎన్‌హెచ్ఏఐ (భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ), ఎంఓఆర్‌టీహెచ్ (రహదారి రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ) అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రయాణికుల నుంచి చాలాకాలంగా వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల టోల్‌ప్లాజాల వద్ద రద్దీ తగ్గడమే కాకుండా టోల్ రుసుముకు సంబంధించిన వివాదాలు కూడా తగ్గుముఖం పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది ప్రైవేటు వాహన యజమానులకు ఇది మరింత సౌకర్యవంతమైన, సులభతరమైన ప్రయాణ అనుభూతిని అందిస్తుందని మంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఫాస్టాగ్ వార్షిక పాస్.. గేమ్‌ఛేంజర్
### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం

జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం, భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ 'ఎక్స్ (ట్విట్టర్)' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఫాస్టాగ్ వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలన్న ప్రయాణికుల చిరకాల డిమాండ్‌కు ఈ నిర్ణయంతో సరైన పరిష్కారం లభించిందని పవన్ పేర్కొన్నారు. టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఈ కొత్త విధానం ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "రూ.3000 వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుంది" అని జనసేనాని పేర్కొన్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ, తరచూ ప్రయాణించే వారికి ఈ విధానం వల్ల సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల ఉన్న నిబద్ధతకు నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిదర్శనమని పవన్ కొనియాడారు. కాగా, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.3000 చెల్లించి ఈ పాస్‌ను పొందవచ్చని ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)' లో వెల్లడించారు. గడ్కరీ చేసిన ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. అయితే, ప్రస్తుతం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, వర్తించే నిబంధనలు ఇంకా వెలువడాల్సి ఉంది.

# మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్..
# ముగ్గురు మావోయిస్టులు మృతి

**న్యూఢిల్లీ, జూన్18ప్రజావినికిడి,** మావోస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఇవాళ తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. చింతకూలు, కొయ్యలగూడెం, కొండమొదలు పరిసర అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. ఇందులో సెంట్రల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, జోనల్ కమిటీ సభ్యురాలు, ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి భార్య అరుణతో పాటు మరో మావోయిస్టు అంజు ఉన్నారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరి కొంతమంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో మారేడుమిల్లి అడవుల్లో గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బనకచర్లను ఆపేయాలి

(మొదటి పేజీ తరువాయి)

టెక్నికల్, పొలిటికల్, లీగల్ ఈ మూడు రకాల ప్రాతిపదికన తమ ప్రయత్నాలను కొనసాగిస్తామన్నారు. పొలిటికల్‌గా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆపడానికి ప్రయత్నిస్తామని, అది సాధ్యం కాని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గోదావరి కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులపై సమగ్రమైన నివేదిక తయారుచేసి కేంద్రంపై ఒత్తిడికి ఎంపీలకు అవగాహన కల్పించేందుకు ఒక నివేదిక తయారు చేసి అన్ని పార్టీల ప్రతినిధులకు అందించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ఒక పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తెలంగాణలోని అన్ని పార్టీల ఎంపీలను ఆహ్వానించారు. ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో బీజేపీ తరపున డీకే అరుణ, రఘునందన్ రావు, బీఆర్ఎస్ తరపున ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఐఎం తరపున అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, రఘురామ్‌రెడ్డి, రఘువీర్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, మల్లు రవి, అనిల్‌కుమార్‌యాదవ్, సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీల నుండి సలహాలు, సూచనలు సేకరించి ప్రాజెక్టును అడ్డుకోవడానికి తదుపరి చర్యలపై ప్రణాళిక ను ప్రభుత్వం రచించనుంది. కేంద్రం ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

తమ ప్రభుత్వానికి తెలంగాణ రైతాంగ ప్రయోజనాలే ము ఖ్యమని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలు ఎజెండాగా మనం ముం దుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా మనందరం కలిసి పనిచేయాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం ఈ స మావేశం ఏర్పాటు చేయలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేంద్ర ప్రభుత్వం 21.-9.-2016 అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసిందని, ఆ సమావేశంలో మొట్టమొదట గోదావరిపై 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని ఆనాటి సీఎం కెసీఆర్ వెల్లడించారని, అసలు ఆ 3వేల టిఎంసిల నీరనే బ్రహ్మ పదార్థం ఎక్కడినుంచి వచ్చిందో ఆపార్టీ వారే వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ సమావేశంలో హరీశ్‌రావు కూడా పాల్గొన్నారని గుర్తు చేశా రు.

# అజెండా 5ను ఎందుకు దాచారు?

హైదరాబాద్ : బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు అని మరోసారి రుజువైందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు పేర్కొన్నా రు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కెసిఆర్ చెప్పిన వాటిని దురుద్దేశపూర్వకంగా వక్రీకరించారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. రాజకీయ లబ్ది పొందాలనే వక్ర బుద్దే తప్ప,తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన లేదని అన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోని అజెండా 5లోని అంశాలు దాచిపెట్టి, అజెండా నెం.1 అంశాలను మాత్రమే ప్రస్తావించారని విమర్శించారు. గోదావరి -కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదు అని కెసిఆర్ అజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం అసత్యాలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల ముందు ఉంచారని, ఈ విషయంలో సిఎం మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. అబద్దాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరు అని హరీష్‌రావు పేర్కొన్నారు.

# ప్రాథమిక హక్కులకు,
# వ్యక్తిగత గోప్యతకు భంగం

**సెల్‌ఫోన్ అప్పగించాలన్న ఏసీబీ నోటీసులపై స్పందించిన కేటీఆర్**
**సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనంపై తీవ్ర అభ్యంతరం**
**ప్రాథమిక హక్కులు, గోప్యతకు భంగమంటూ లేఖ**
**సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన మాజీ మంత్రి**

**జూన్18ప్రజావినికిడి,**



ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారానికి సంబంధించి తన సెల్‌ఫోన్‌ను అప్పగించాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జారీ చేసిన నోటీసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఏసీబీ అధికారులకు ఒక లేఖ రాశారు. ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే కేటీఆర్‌ను కూడా అధికారులు విచారిస్తున్నారు.

విచారణలో భాగంగా కేటీఆర్ వాడుతున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు అందజేయాలని ఏసీబీ అధికారులు కోరారు. అయితే, తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరడం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో నొక్కి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను గానీ, ల్యాప్‌టాప్‌ను గానీ ఏసీబీకి అప్పగించాల్సిన అవసరం లేదని న్యాయనిపుణులు కేటీఆర్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సలహా మేరకే కేటీఆర్ ఏసీబీకి లేఖ ద్వారా తన నిర్ణయాన్ని తెలియజేశారు.

# మధ్యవర్తిత్వం అబద్ధం..!

**జూన్18ప్రజావినికిడి,**

కెనడా నుంచి తిరిగి వెళ్తున్న సమయంలో అమెరికా రావాలని మోడీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. అయితే, ముందస్తు షెడ్యూల్ ఉన్న కారణంగా మీ ఆహ్వానాన్ని మన్నించలేనని భారత ప్రధాని వివరించినట్లు విక్రమ్ మిస్త్రీ తెలిపారు. కాగా, త్వర లోనే ద్వైపాక్షికంగా భేటీ అవ్వాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. 'భారత్లో జరిగే క్వాడ్ సమావేశానికి రావాలంటూ మోడీ.. ట్రంప్ను ఆహ్వానించారు. మోడీ ఆహ్వానాన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు' అని మిస్త్రీ చెప్పారు. ఈ ఏడాది చివర్లో క్వాడ్ సమ్మిట్ను భారత్ నిర్వహించే అవకాశం ఉన్నది. చైనా ఆధిపత్యం చెలాయించ దానికి ప్రయత్నిస్తున్న ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నిర్ధారించడంలో క్వాడ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించినట్లుగా తెలుస్తున్నది. కాగా, మూడు దేశాల పర్యటన లో చివరి దశలో భాగంగా మోడీ కెనడా నుంచి క్రొయేషియాకు బయల్దేరి వెళ్లారు. భారత ప్రధాని ఈ బాల్కన్ దేశాన్ని పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరుపక్షాల సైన్యాల మధ్య జరిగిన చర్చల సమయంలో తీసుకున్నారని, అమెరికా మధ్యవర్తిత్వం లేకుండానే నేరుగా ఒప్పందం తీసుకున్నారని ట్రంప్తో చెప్పడంతో... కాల్పుల విర మణకు తాను మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ చేసిన వాదనలను తిప్పికొట్టారు. ఈ విషయాలను ట్రంప్కు ఫోన్లో స్పష్టం చేసినట్లు కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. పహల్గాం ఉగ్ర వాద దాడి అనంతరం ట్రంప్.. మోడీకి ఫోన్ చేసి సంతాపం తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత వీరిద్దరూ ఇప్పుడే మాట్లాడుకోవడంతో 'ఆపరేషన్ సిందూర్' వివరాలను అమెరికా అధ్యక్షుడికి మోడీ వివ రించారు. 'పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చ జరగలేదు. భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వం పెనా చర్చ జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్-పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ ప్రాధేయ పడటంతో ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడే కాదు, ఎప్పు దూభారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని ట్రంప్కు మోడీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉన్నది' అని మిస్త్రీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ -ఇరాన్ మధ్య వివాదం, రష్యా-ఉక్రెయిన్ వివాదం గురించి కూడా ట్రంప్, మోడీ చర్చించారు. వీలైనంత త్వరగా శాంతి కోసం రష్యా -ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష సంభాషణ అవసరమని, దీని కోసం ప్రయత్నాలు కొనసాగించాలని ఇరువురు నేతలు అంగీకరించారని వ్యక్తం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
గురువారం19 జూన్ 2025

# ఘనంగా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బల్కంపేట దేవాలయంలో ఐదో వార్షికోత్సవ బోనాలు..





**ప్రజావినికిడి, (నాంపల్లి):** టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో బల్కంపేట్ ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం అంగరంగ వైభవంగా టీఎన్జీవో కేంద్ర సంఘ%శీ% ప్రధాన కార్యదర్శి ముజీబ్ ఆధ్వర్యంలో ఐదో వార్షికోత్సవ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సంఘ%శీ% అధ్యక్షులు మారం జగదీశ్వర్, గెజిటెడ్ అధికారుల సంఘ అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, టీఎన్జీవో,వివిధ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక మెంబర్స్ ఉద్యోగస్తుల హాజరయ్యారు. అమ్మవారికి శివసత్తుల ఆటలతో డోలు సన్నాయితులతో బోనాల ఊరేగింపు జరిపి అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతర%శీ% అమ్మవారినీ దర్శించుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్,
టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్,కార్యదర్శి కురాడి శ్రీనివాస్, అసోసియేటెడ్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్,కోశాధికారి బాల్ రాజు,కేంద్ర సంఘ%శీ% సభ్యులు, ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి,పర్వతాలు, శైలజ,ప్రెసిడెంట్ నరేష్,సంయుక్త కార్యదర్శి కాలేదు సుజాత,ప్రచార కార్యదర్శి వైదిక శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీధర్,ముక్రం,సెంట్రల్ యూనియన్ స్పోర్ట్స్ కార్యదర్శి శంకర్ ఈఎన్ టి రాజకుమార్,జూ పార్క్ అధ్యక్షులు నరేందర్,ఈఎస్ఐ అధ్యక్షులు రాజ్ కుమార్,గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అయోధ్య వరప్రసాద్, మహేందర్,ఐటిఐ సత్యనారాయణ, విద్యాశాఖ వైస్ ప్రెసిడెంట్ యోగేష్, ప్రచార కార్యదర్శి ఎమ్మే రవి,సెక్రటరీ సుదర్శన్, పబ్లిసిటీ జలాల్లో సెక్రటరీ అరుణ,ఆర్గనైజ్ సెక్రెటరీ శివ,హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ అశోక రాణి పాల్గొన్నారు. యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి బోనం వేడుకలను జయప్రదం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర మైన్స్ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు..

### తెలిపిన నల్లమల్లిసామ్రాజ్యలక్ష్మి



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** తెలంగాణ రాష్ట్ర మైన్స్ మరియు కార్మిక శాఖ మంత్రివర్యులు గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్ వెంకట స్వామి కి పుష్పగుచ్ఛం అందజేసి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసిన నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (రాధ)అదనపు ప్రధాన కార్యదర్శిని, తెలంగాణ రాష్ట్రం ఆర్యవైశ్య మహాసభ - మహిళా విభాగం..

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

### : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ..





**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణని నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు,మహిళలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు వారు సానుకూలంగా స్పందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఈనెల 28వ తేదీన దుండిగల్ గ్రామంలో మిద్దమైసమ్మ మహిళా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించబోయే శ్రీశ్రీశ్రీ మిద్దమైసమ్మ దేవాలయ కుమ్మర్ల బోనాల జాతర మహోత్సవ కార్యక్రమ పోస్టర్ ను ఆలయ సంఘం ప్రెసిడెంట్ కుమ్మరి లక్ష్మి ఆధ్వర్యంలో పోస్టర్ ను ఆవిష్కరించారు.

# ఆగస్టు 19 నుండి 22 వరకు తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలు..

### ఏఐటీయూసీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ మండల కౌన్సిల్ సమావేశం..



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ మండల కౌన్సిల్ సమావేశం సిపిఐ మాజీ కౌన్సిలర్ పి.నర్సయ్య అధ్యక్షతన పొట్లూరి నాగేశ్వరరావు భవన్ ఏఐటీయూసీ కార్యాలయం షాపూర్నగర్ లో జరపడం జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్ పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలోని మహారాజా గార్డెన్ లో ఆగస్టు 19నుండి 22 వరకు నిర్వహించుకుంటున్నామని ముఖ్యంగా భూపోరాటం చేసి గురుమూర్తినగర్ నుండి రావినారాయణరెడ్డి నగర్ వరకు వందల ఎకరాల ఇండ్ల స్థలాలు పంచిన చరిత్ర భారతకమునిస్ట్ పార్టీది అని నిత్యం ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసి మంచినీటి సమస్య,వీధి లైట్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వంటి మౌలిక సమస్యలపై పోరాటాలు చేసిన నాయకులున్న ప్రాంతం రాష్ట్ర మహాసభలను అందరము ఒక ఛాలెంజ్ గా తీసుకొని విజయవంతం చేయగలరని అందుకు ప్రతి శాఖా సభ్యుడు ముందుండి నడవాలని ఇంటింటికి ప్రచార కరపత్రం చేరవేసి మహాసభల ప్రాధాన్యత తెలుపాలని పిలుపునివ్వడం జరిగిందిసిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి మాట్లాడుతూ ప్రతి శాఖ కమిటీలు వేసుకొని దళములు ఏర్పరచుకొని కళాకారులతో వ్యాపార సముదాయాలు, మార్కెట్లో,ప్రతి ఇంటికి పోయి విరాళములు సేకరించి కార్యక్రమమును విజయవంతం చేసుకుందామని అన్నారు. ఈ సమావేశంలో మండల సహాయకార్యదర్శి హరినాథరావు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు,సి.వెంకటేష్, మండల కోశాధికారి సదానంద్,శాఖా కార్యదర్శులు వెంకటేష్,మధుసూదన్ రెడ్డి,వీరస్వామి , నర్సయ్య, ప్రజానాట్యమండలి నాయకులు ప్రవీణ్ , సంతోష్ రెడ్డి,నరసింహారెడ్డి,ఇమామ్, ముసలయ,జంబూ, కె.శ్రీను,సాయిలు, చంద్రయ్య,పాల్గొనడం జరిగింది.

# జీడిమెట్ల గ్రామంలో ఘనంగా దమ్మని శ్రవణ్ కుమార్ జన్మదిన వేడుకలు..

### - కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన కోలన్ హన్మంత్ రెడ్డి..







**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్లలో మేడ్చల్ మల్కాజిగిరి డి.సి.సి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ జన్మదిన కార్యక్రమం గణంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి విచ్చేసి శాలువాతో సత్కరించి శ్రవణ్ కుమార్ తో కేక్ కట్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూసుమారుగత 41 సంవత్సరం నుండి శ్రవణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవ చేస్తున్నారని ఎంతమంది ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన ఆయన కాంగ్రెస్ పార్టీకి సేవ చేయడం తన దేయమని నాటి నుండి నేటి వరకు చిన్న స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీలో సేవలు చేస్తూ నేటికీ నియోజకవర్గంలోనే ఒక పెద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకుడుగా పేరు పొందారని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అండతోని తాను ప్రజలకు ఎంతో సేవా అందిస్తున్నారని కూడా ఈ సందర్భంగా తెలియజేశారు. గత పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కష్ట కాలం లోఅండగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా అందరిని మమేకం చేస్తూ కాంగ్రెస్ గెలుపుకు నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. దమ్మని శ్రవణ్ కుమార్ తండ్రి కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు అందించారని, అదే బాటలో శ్రవణ్ కుమార్ పార్టీ కోసం కష్టపడ్డారని,ఇలాంటి వ్యక్తులు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని గుర్తు చేశారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్న సత్వర పరిష్కారం చేసి గొప్ప వ్యక్తి అని జీడిమెట్ల గ్రామ పెద్దలుఆయనను ప్రశంసించారు. శ్రవణ్ కుమార్ కు కాంగ్రెస్ పార్టీ తప్పక గుర్తించి సముచిత స్థానం ఇవ్వాలని వారు కోరారు. ఇలాంటి గొప్ప వ్యక్తుల వల్ల కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చెందుతుందని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజే జేమ్స్,మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బండి శ్యామ్ గౌడ్,సిద్ధనోళ్ల సంజీవరెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు లక్ష్మారెడ్డి,జయరాం,మరియు రషీద్ భాయ్,ఎన్ఎంసి



అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి,జీడిమెట్ల గ్రామ పెద్దలు తునికి కృష్ణారావు రాఘవేంద్రరావు,దేవేందర్ యాదవ్ జి. బీరప్ప,132 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బేకుకు శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ ఏడు డివిజన్లో అధ్యక్షులు. అందరూ కాంగ్రెస్ నాయకులు,బాలప్ప బి.రంగయ్య,పి మహిపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, 132 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత యాదవ్ మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు రమణి కౌసల్య ముదిరాజ్, హసీనా బేగం,లక్ష్మి. లలిత,రజిత. తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆటో కార్మికుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ..!



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కుమ్మరి కుంట పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ఉండడం చూసి సంబంధిత శానిటేషన్ జవాన్ రాంచంధర్ పై ఆగ్రహం వ్యక్తం చేసారు. అదేవిధంగా స్వచ్ఛ ఆటో కార్మికులు వారంలో రెండు రోజుల కూడా వివిధ కాలనీలో ఇంటింటి చెత్తా సేకరించడం లేదని తరచు కాలనీవాసుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని,చెత్త సేకరించడం లో స్వచ్ఛ ఆటో కార్మికులు ఎలాంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించకుండా వారిని తొలగించాలని జవాన్ రాంచంధర్ శానిటేషన్ సూపెర్వైసోర్ నగేష్ కు కార్పొరేటర్ తెలిపారు.



# సంకెళ్లతో కోర్టుకు అన్నదాతలు

జోగులాంబ గద్వాల్ **ప్రజావినికిడి,:**
పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతుల చేతులకు సిఎం రేవంత్ బేడీలు వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలంపూర్ కోర్టు వద్ద అన్నదాతలకు పోలీసులు సంకెళ్లు వేసిన సంఘటన ముఖ్యమంత్రి రాక్షస మనస్తత్వానికి పరాకాష్ట అని విమర్శించారు. పెద్ద ధన్వాడలో గత కొన్ని నెలలుగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అనేక గ్రామాల ప్రజలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే దారుణమైతే.. చివరికి దొంగలు,
నేరస్తుల లాగా బేడీలు వేయడం క్షమించరాని నేరం అని పేర్కొన్నారు. గతంలో లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీని అడ్డుకున్నారనే కోపంతో గుండెపోటు వచ్చిన రైతుపై కనికరం కూడా లేకుండా బేడీలు వేసి, ఈ ముఖ్యమంత్రి మహాపాపాన్ని మూటగట్టుకున్నారని అన్నారు. ఇప్పుడు పెద్ద ధన్వాడ రైతుల విషయంలో కూడా ఇంత నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి అన్నదాతల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుంది కాబట్టి రేవంత్ వెంటనే రైతులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అక్రమ నిర్మాణాలపై డిసి స్పందించారా..?

**కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాలలో అధికారుల,సిబ్బంది చేతివాటం..**

**ఫిర్యాదులు చేసిన పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు..**

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న వైనం..**

**జోనల్ కమిషనర్ స్పందించరు,అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేయరు..**





**ప్రజావినికిడి,(కాప్రా):**
ఎల్బీనగర్ జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి దందాకు అంతం లేకుండా పోయింది.అక్రమ నిర్మాణాలకు అడ్డాగా కాప్రా టౌన్ ప్లానింగ్ విభాగం మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల బాధ్యతారాహిత్యం అక్రమార్కులకు అండదండలు అందించడంతో అక్రమ సంపాదనే దేయంగా అధికారుల తీరు మారిందని స్థానికులు మండిపడుతున్నారు. అధికారయంత్రాంగంచైన్మెన్ లు,సెక్షన్ ఆఫీసర్,ఏసిపి,డిసి చేతివాటం తో టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి అధికారులు అడ్డగోలుగా ఆకాశమే హద్దుగా బహుళ అంతస్తుల భవనాలు యదేచ్ఛగా నిర్మిస్తున్న అవినీతి అధికారులు చర్యలు తీసుకోరా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతిని చూడలేకపోతున్నామంటూ ఏసీబీ దయ తలచి ఇలాంటి అవినీతి అధికారుల పై వెంటనే దాడులు చేసి అక్రమంగా సంపాదించిన కోట్ల ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.కాప్రా పరిధిలో అధికారులు మారినా అక్రమ నిర్మాణాలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. ఓ వైపు ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తూ హైడ్రా లాంటి ప్రత్యేక వ్యవస్థలను ప్రవేశపెట్టి భారీ భవనాలను సైతం కూల్చివేస్తుంటే

మరోవైపు కాప్రా సర్కిల్ పరిధిలో అంతే వేగంగా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. కాప్రా సర్కిల్ లో అధికారులు అక్రమ నిర్మాణాలను పట్టించుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అయ్యప్ప స్వామి గుడి వీధిలో కమల నగర్ లోని ఎదురింటి నెంబర్ 1%-7-%233/2 ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా ఒక భారీ అక్రమ నిర్మాణం.మరో అక్రమ నిర్మాణం ఎదురింటి నెంబర్ 1%-7-%78 స్టిల్ట్ ప్లస్ టు అనుమతులు తీసుకొని ఎలాంటి సెట్ బ్యాగులు లేకుండా అక్రమ అంతస్తుల తో పాటు కమర్షియల్ దుకాణాలు వేస్తున్నారు. మరో అక్రమ నిర్మాణం ఎదురింటి నెంబర్ 1%-7-%775 అయితే ఎలాంటి సెట్ బ్యాగులు లేకపోవడంతో పాటు దుకాణాలు వేసి కమర్షియల్ నిర్మాణం చేశారని అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం, అండతో అక్రమ నిర్మాణదారులు చెలరేగిపోతున్నారు. ఫలితంగా అనుమతులు లేకుండానే పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నాయి. సర్కిల్ పరిధిలో ఉన్న డివిజన్లలో కొన్ని ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికుల అభ్యర్థనలపై అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో డిప్యూటీ కమిషనర్, ఎసిపి 'డోంట్ కేర్' ధోరణిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతుల కోసం దరఖాస్తు చేసిన వారు వేర్వేరు కారణాలు చూపుతూ



నిర్మాణాలు చేబడుతున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమ నిర్మాణాలను చూసి కొందరు భయాందోళనకు గురవుతున్న యజమానుల నుంచి అధికారులు ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చైన్మెన్ నుంచి ప్లానింగ్ విభాగాల్లోని అధికారులు సిబ్బంది అక్రమ ఆదాయ కోసం ఇటువంటి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ పరిస్థితులపై జోనల్ కమిషనర్ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుంటే, భవిష్యత్తులో కాప్రా సర్కిల్ పరిధిలో పరిస్థితి చేతి దాటే ప్రమాదం ఉందని తాగునీటికి డ్రైనేజీ వ్యవస్థకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



## పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతి సి.ఎం.ఆర్.ఎఫ్. పథకం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్...

**కుత్బుల్లాపూర్ ప్రజావినికిడి**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం 129వ డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన రామచందర్ , వయసు - 57, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన వైద్య చికిత్స కోసం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ని సంప్రదించారు. ప్రజా సంక్షేమాన్ని ప్రథమ ప్రాముఖ్యతగా తీసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించగా, బుధవారం స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఎల్.ఓ.సి.చెక్కును లబ్ధిదారుడు రామచందర్ కుటుంబానికి చింతల్ లోని ఎమ్మెల్యేకార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ %-% అవసరమైన, అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలనే లక్ష్యంతో సి.ఎం.ఆర్.ఎఫ్. పథకం అమలవుతోందని, నిత్యం ప్రజల పక్షాన నిలబడి పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే నాయకుడు మా మ్మెల్యే కెపి.వివేకానంద్ అని,అర్హులైన ప్రతీ ఒక్క నిరుపేద సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ సిద్దిక్,నాయకులు చెక్కా సురేష్, హెచ్.ఎ.ఎల్.బషీర్ తదితరులు పాల్గొన్నారు




## ఉత్తమ వైద్యసేవలకు దక్కిన గౌరవమే ఉత్తమ డాక్టర్ అవార్డు..

**ఉత్తమ డాక్టర్ అవార్డు గ్రహిత వెంకట్ రమణ ను సన్మానించిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఉత్తమ వైద్యసేవలకు గాను అత్యున్నతమైన ఉత్తమ డాక్టర్ అవార్డు మిరియాల వెంకట రమణ కి రావడం సంతోషించదగిన విషయమని సమాజంలోని అన్ని రంగాలలో పొందే అవార్డుల యొక్క ప్రాముఖ్యతను వెలకట్టలేమని చేసిన సేవలకు గుర్తింపుగా దక్కే అరుదైన గౌరవమే అవార్డు అని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. ఇటీవలే సుమన్ టివి నిర్వహించిన డాక్టర్ అవార్డ్స్ లో షాద్ నగర్ పట్టణానికి చెందిన మిరియాల వెంకట రమణకు ఉత్తమ డాక్టర్ అవార్డు వచ్చిన సందర్భంగా వారి యొక్క హాస్పిటల్ కి వెళ్లి వారిని శాలువాతో సత్కరించి సన్మానించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.రానున్న రోజుల్లో షాద్ నగర్ పట్టణ ప్రజలకు మంచి వైద్య సేవలు అందించి వైద్య రంగంలో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ బీఎస్ సుధీర్,మరియు పలబట్ల శివకుమార్,పలబట్ల బాల్ రాజ్,డాక్టర్ తులసి,అన్వారీ రాజు,కాటా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ లో ప్రైవేట్ స్కూల్స్ దందాలు..

**ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓ మనోహర్ కు వినతి పత్రం..**

**ఒక పేరుతో పాఠశాల పర్మిషన్ తీసుకొని ఇంకో పేరుతో పాఠశాలలు నడుపుతున్న మేనేజ్మెంట్లు..**

**అలాంటి స్కూల్ లపై వెంటనే చర్యలు తీసుకోవాలి..**




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల దందాలు నడుస్తున్నాయనిఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఆరోపించారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారి మనోహర్ కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ,ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు, మంచి మౌలిక వసతులు,అలాగే నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పుకుంటాయి.కానీ, ఈ సౌకర్యాల పేరుతో వసూలు చేసే అధిక ఫీజులు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఫీజులలో ట్యూషన్ ఫీజు మాత్రమే కాకుండా,ప్రవేశ రుసుము,రవాణా రుసుము,కార్యకలాప రుసుము, అదేవిధంగా నోట్బుక్స్, యూనిఫామ్లు, పుస్తకాల కోసం అదనపు ఖర్చులు కూడా ఉంటాయి. ఈ ఖర్చులు మధ్యతరగతి మరియు తక్కువ ఆదాయ కుటుంబాలకు భరించలేని స్థాయిలో ఉంటాయి.నోట్బుక్స్ ఖర్చు - ఒక ఆందోళన ప్రైవేట్ స్కూల్స్ తరచూ విద్యార్థులకు నోట్బుక్స్,పుస్తకాలు, మరియు ఇతర అవసరమైన సామగ్రిని తమ స్కూల్ నుండి మాత్రమే కొనుగోలు చేయమని బలవంతం చేస్తాయి. ఈ నోట్బుక్స్ ధరలు సాధారణ మార్కెట్ ధరల కంటే చాలా ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు, ఒక స్కూల్ అందించే నోట్బుక్ ఇందులో స్కూల్ లోగో లేదా బ్రాండ్ పేరు ఉంటుందని చెప్పి, అధిక ధరను సమర్థించుకుంటాయి. ఈ విధానం తల్లిదండ్రులకు అనవసర ఖర్చును తప్పనిసరి చేస్తుంది.షాద్ నగర్ లో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు వారికీ ఎలా నచ్చితే ఆలా ఫీజులు వసూలు చేస్తూ పాఠ్యపుస్తకాలు మా దగ్గరే కొనాలి అని విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బంది కలుగజేస్తున్నారు. మరియు ఒక పేరుతో పెర్మిషన్ తీసుకొని ఇంకో పేరు పెట్టి విద్యార్థులను అలాగే వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు కాబట్టి ఎంఈఓ ఈ విషయాలపై వెంటనే స్పందించాలి అని లేకుంటే ఎస్ఎఫ్ఐ గా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి శివశంకర్, వినయ్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన.. ప్రజల వద్దకే భూ పరిపాలన..

**ఫరూక్ నగర్ లో తహసిల్దార్ పార్థసారధి ఆధ్వర్యంలో ఘనంగా రెవెన్యూ సదస్సు..**

**వివిధ సమస్యలతో ప్రభుత్వానికి 33 దరఖాస్తులు..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫరూక్ నగర్ మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సును స్థానిక తహసిల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ హాజరయ్యారు. సదస్సులో మొత్తం వివిధ సమస్యలపై 33 దరఖాస్తులు వచ్చాయని మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తెలిపారు. ఖాతాల మార్పిడి కోసం 17 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అదేవిధంగా సర్వే నెంబర్ల సవరణలు 2 దరఖాస్తులు, భూములకు సంబంధించిన హద్దుల సవరణలు 6 దరఖాస్తులు,నిషేధిత స్థలాలను తీసివేయుట 5 దరఖాస్తులు, డిజిటల్ సంతకాలు 1 దరఖాస్తు, ఇళ్ల స్థలాల సవరణలకు సంబంధించిన మరొక దరఖాస్తు రెవిన్యూ సదస్సు సందర్భంగా ప్రజలు ప్రభుత్వానికి అందజేసినట్లు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో భూభారతి చట్టాన్ని అమల్లోకి




తెచ్చిన తర్వాత నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు గుర్తుచేశారు. 'ప్రజల వద్దకే రెవెన్యూ' నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు.అనేక గ్రామాల్లో సాదాబైనామా దరఖాస్తులూ ఉన్నాయని,ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూ శాఖ ఉంటుందని, అధికారులు సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు.గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను..గ్రామ స్థాయిలో అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోందన్నారు. రెవెన్యూ అధికారులు మానవీయ కోణంలో భూ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లే రెవెన్యూ బృందం కూడా మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్గా నిలవనుందని ప్రశంసించారు.ఈ సదస్సులో తహసిల్దార్ పార్థసారథి,కాంగ్రెస్ మైనార్టీ నేత మహమ్మద్ ఇబ్రహీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్,మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగమోని సత్తయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో సీనియర్ జర్నలిస్టు మాదిరాజు సురేష్ కుమార్ సంస్మరణ సభ..

### ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా నివాళులు అర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్.. మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి..







**ప్రజావినికిడి,(ఉప్పల్):**
హైదరాబాద్ ఉప్పల్ లో ఇటీవల హఠాన్మరణం చెందిన జర్నలిస్టు మాదిరాజు సురేష్ సంస్మరణ సభ నిర్వహించారు. బుధవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేకేఆర్ గార్డెన్ లో నిర్వహించిన సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి , మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ , మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పుర ప్రముఖులు హాజరై జర్నలిస్టుగా సురేష్ చేసిన సేవలను కొనియాడారు. ఉప్పల్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సురేష్ చేసిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ,ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండే జర్నలిస్టు సురేష్ మృతిని ఎవరు జీర్ణించుకోలేక పోతున్నారని,ఉప్పల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సురేష్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వము కృషి చేయాలని ఆయన సూచించారు. సురేష్ కుటుంబానికి తనవంతుగా ప్రభుత్వంలోని పెద్దలతో చర్చించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు. సురేష్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ,ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్ట్ సురేష్ ఎంతో చురుకుగా ఉండేవాడని కొనియాడారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ నిర్మాణంలో తాను ఎంతో సహకరించాలని, అదేవిధంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సురేష్ కూడా ఎంతో చొరవ చూపే వారని గుర్తు చేశారు. మల్కాజ్గిరి పార్లమెంటు బిఆర్ఎస్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతూనే దుర్భరమైన ఆర్థిక పరిస్థితుల్లో తమ జీవనాన్ని నెట్టుకు రావడం బాధ కలిగిస్తుందన్నారు. జర్నలిస్టులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని యావత్ సమాజం కూడా అండగా నిలవాలని కోరారు. జర్నలిస్టు సురేష్ కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి మాట్లాడుతూ,ఉప్పల్ జర్నలిస్టులు నిస్వార్థంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడతారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు లు మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు నాయకులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని అభినందించారు. జర్నలిస్టులకు అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని వారు గుర్తు చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సురేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని, ఆర్థికంగా ఆదుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభకు సురేష్ సతీమణి, కూతురు తో పాటు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సంస్మరణ సభలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఉప్పల్ తహసిల్దార్ వాణిరెడ్డి,డిప్యూటీ తాసిల్దార్ సునీల్, ఉప్పల్ గ్రామ ప్రముఖుడు బండి నరసింహారెడ్డి,మేకల దయాసాగర్ రెడ్డి,బి ఆర్ ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జన్ శేకర్,గంధం నాగేశ్వరరావు మేకల మధుసూదన్ రెడ్డి, గుడి మధుసూదన్ రెడ్డి,లేతాకుల రఘుపతి రెడ్డి,అన్య బాలకృష్ణ, ఏ.మోహన్ రెడ్డి,పిల్లి నాగరాజు, కొండల్ రెడ్డి,పల్లె నర్సింగరావు,పిట్టల నరేష్,ఈరెల్లి రవీందర్ రెడ్డి,కే జగన్,సుఖ కిరణ్,నిరంజన్,పంగ మహేందర్ రెడ్డి, తెలంగాణ



సంపత్, సుధాకర్ శెట్టి,చర్ల సుధాకర్ రెడ్డి,సిపిఎం నాయకులు ఎర్రం శ్రీనివాస్,వినోద, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

**మీడియా అకాడమీ నుంచి ఆర్థిక సహాయానికి సత్వర కృషి:టి యు డబ్ల్యూ జే నాయకులు**

ఆకస్మికంగా మృతి చెందిన ప్రజా దర్బార్ పత్రిక రిపోర్టర్ మాదిరాజు సురేష్ జ్ఞాపకార్థం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేకేఆర్ గార్డెన్ లో నిర్వహించిన సంస్మరణ సభలో జర్నలిస్టులు నివాళులర్పించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోత వెంకటరెడ్డి,మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, కార్యదర్శి దొంతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ,సురేష్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వ మీడియా అకాడమీ నుంచి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని సాధ్యమైనంత త్వరలో వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అతని కుటుంబానికి మీడియా అకాడ నుంచి ప్రతినెల రూ 3000 పెన్షన్ అందుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. జర్నలిస్టు సురేష్ సంస్మరణ సభ ను విజయవంతం చేయడంలో కృషిచేసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులందరినీ టీయూడబ్ల్యూజే నాయకులు అభినందించారు.

# అధిక ఫీజులను నియంత్రించాలని అచ్చంపేట ఆర్డీవో, ఎంఈఓ లకు వినతి పత్రం అందజేత..



**ప్రజావినికిడి,(అచ్చంపేట):**పట్టణంలోని ప్రవేటు పాఠశాలలో అధిక ఫీజులను నియంత్రించాలని ఎంఈఓ గారికి మరియుఆర్డిఓ గారికి బిజెపి అచ్చంపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలోవినతి పత్రం ఇవ్వడం జరిగింది. పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు కనీస అవసరాలైన మైదానం నీరు మూత్రశాల లాంటి వసతులు కల్పించకుండా కార్పొరేట్ స్కూల్లపేరు పెట్టుకుని కొన్ని పాఠశాలలో అర్హతలేనటువంటి సిబ్బందితో బోధిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు నోట్బుక్కులు అమ్ముతూ వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల తల్లిదండ్రుల ఆవేదనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు పర్యవేక్షించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్య నాయక్,మండికారి బాలాజీ,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పట్టణ అధ్యక్షులు గండు శ్రీనివాస్ గౌడ్ కృష్ణంరాజు రాము యాదవ్ రాజు శంకర్ గౌడ్ అనిల్ గోలి రాజు శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాగంటి గోపీనాథ్ దశదినకర్మకు హాజరైన తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి..

### కేటీఆర్ సేన రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ జి.విజయ్ కుమార్..

ప్రజావినికిడి,(షాద్ నగర్):జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే,హైదరాబాద్ అధ్యక్షులు దివంగత మాగంటి గోపీనాథ్ దశదినకర్మకు హాజరై,వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి.కేటీఆర్ సీన రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ జి విజయ్ కుమార్.మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.



# వెల్జర్ల బీసీ కాలనీ మహిళా కమిటీ ఏర్పాటు..

### ఫరూక్‌నగర్ మండల అధ్యక్షురాలు జక్కల జలజ ఆధ్వర్యంలో మహిళల కమిటీ ఎన్నిక..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఫరూక్‌నగర్ మండలంలోని వెల్జర్ల బీసీ కాలనీలో నూతన మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలు జక్కల జలజ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌదరిగూడ మండల అధ్యక్షురాలు ప్యాట జయశ్రీకాంత్, షాద్‌నగర్ టౌన్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఫరూక్‌నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతి రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్కల జలజ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తామని, మహిళలందరూ ముందుకు వచ్చి రాజకీయంగా, సామాజికంగా బలపడాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంతో తాను నిత్యం మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తూ, మహిళలను ఏకతాటిపైకి తీసుకువస్తున్నట్లు ఆమె తెలియజేశారు. నూతనంగా అధ్యక్షురాలుగా దొడల మంజుల, ఉపాధ్యక్షురాలుగా చాకలి అనిత,ప్రధాన కార్యదర్శిగా డి. సద్గుణ,కార్యదర్శిగా సంజన,సహాయ కార్యదర్శిగా సి.జ్యోతి, కోశాధికారిగా కర్ణం కళావతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు,పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# షాద్ నగర్ పట్టణంలో అంతర్జాతీయ యోగ అవగాహన బైక్ ర్యాలీ..

### యోగ జీవన విధానంలో భాగం కావాలి యోగ గురువు పానుగంటి శశిధర్..




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని బుధవారం పతంజలి యోగ సమితి స్థాపకులు అధ్యక్షులు పానుగంటి శశిధర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బైక్ ర్యాలీతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక షాద్ నగర్ ముఖ్య కూడలి నుండి యోగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపిటిఓ ఆఫీస్ నుండి ప్రారంభమైన యోగా ర్యాలీ ప్రధానగా షాద్ నగర్ పట్టణలోని పలు కాలనీలలో,వీధులలో బైక్ ర్యాలీ పెద్ద ఎత్తున కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత,కోసం రోజు వారి యోగ అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు రామచంద్రయ్య, రామయ్య, గవ్వయ్య, విజయ్ కుమార్, కుమారస్వామి, మురళి, వెంకటరామిరెడ్డి, యోగాని అభ్యసించేవారు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### నేడు మంజూరు పత్రాలు అందజేయనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
భువనగిరి జిల్లా వాసాలమర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. “వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు 2020 నవంబర్ 1న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఆనాడు ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో సహపంక్తి భోజనం చేశారు. బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ వాస్తవంగా ఆరోజు నుంచి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయే 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు.

ఆయన ఫాంహౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి నిలువ నీడ లేకుండా చేశారు. ఆ బాధితులు ఇండ్లు కోల్పోయి తాత్కాలికంగా గుడిసెలు,టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. బంగారు వాసాలమర్రి దేవుడెరుగు.. ఉన్న ఇండ్లను కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించడం జరిగింది.

అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశాం. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం నాడు నేనే స్వయంగా వారికి అందజేస్తున్నాను. దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారు. కొత్త ఇల్లు రాలేదు.. ఉన్న ఇల్లు పోయింది. ప్రజల అవసరాలను ఆశలను వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాలమర్రి గ్రామమే ఒక నిదర్శనం” అని అన్నారు.

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నాడు రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నారు.
అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను

మంజూరు చేశాం. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం నాడు నేనే స్వయంగా వారికి అందజేస్తున్నాను. దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారు. కొత్త ఇల్లు రాలేదు.. ఉన్న ఇల్లు పోయింది. ప్రజల అవసరాలను ఆశలను వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాలమర్రి గ్రామమే ఒక నిదర్శనం” అని అన్నారు.

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నాడు రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాల నిర్వహణ




**ఖమ్మంజిల్లా బ్యూరో/జూన్18ప్రజావినికిడి,**
ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి సమీక్షించారు.గురుకులాల నిర్వహణ, స్టడీ సర్కిల్ పని తీరు, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పని తీరు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి గురుకులాల పాఠశాలల ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందని అన్నారు. సరైన వసతులు లేని గురుకులాల భవనాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.గురుకుల పాఠశాలల్లో పిల్లలకు దోమలు కుట్టి ఇబ్బంది పడటానికి వీలు లేదని, ప్రతి గురుకులంలో పూర్తి స్థాయిలో మెష్ జాలీ లు ఏర్పాటు చేయాలని అన్నారు. హాస్టల్స్ లో అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని అన్నారు. కామన్ డైట్ ప్రోగ్రాం సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్ ప్లే చేయాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, దీనికి సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. గురుకులాల పరిసరాల్లో పండ్ల మొక్కలను పెద్ద స్థాయిలో పెంచాలని, దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కోటి మొక్కల వరకు పెంచుతున్నామని అన్నారు. ప్రతి మొక్క మీద ప్రభుత్వం కనీసం 300 రూపాయల వరకు ఖర్చు చేస్తుందని, ఒక జిల్లాలో సంవత్సరానికి 300 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సర్వైవల్ పై శ్రద్ధ పెట్టాలని అన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఎన్ని బ్రతికాయో వాస్తవిక రిపోర్ట్ అందించాలని అన్నారు.గురుకులాల భవనాలకు సంబంధించి రెంట్, డైట్ చార్జీల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేస్తుందని, పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు.

మహిళలకు ఉచిత బస్సు అందించడంతో పాటు అది సౌకర్యవంతంగా ఉండేలా మనం చర్యలు చేపట్టామని, డిమాండ్ ఉన్న రూట్ లలో అదనపు బస్సులు నడపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ లను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే నూతన బస్సులు కొనుగోలు చేసి పంపడం జరుగుతుందని అన్నారు. సమీక్ష లో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాలలో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ, వన మహోత్సవం కార్యక్రమంలో తాటి, ఈత ఖర్జూర మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

గురుకులాల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గ పర్చాల్సిన అవసరం ఉందని, ఐఐటి, నీట్ వంటి పరిక్షలలో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ అందించాలని అన్నారు. పెరిగిన డైట్ చార్జీలు వినియోగిస్తూ ప్రభుత్వం సూచించిన కామన్ డైట్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని అన్నారు.

గురుకులాలో మంజూరైన సీట్లు పూర్తి స్థాయిలో నింపాలని, సొంత భవనాలు లేని గురుకులాలకు అవసరమైన భూమి గుర్తించాలని, ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ యువతకు ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్ లో బీసీ స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించేలా చూడాలని అన్నారు. హైదరాబాద్ కు రావాల్సిన అవసరం లేకుండా అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, శిక్షణ మన ఖమ్మంలో అందించాలని అన్నారు. ప్రస్తుత సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో 81 వేల ఈత మొక్కలు నాటేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని, గీత కార్మికుల సోసైటీ లను వీటిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేస్తూ కాలువల వెంబడి, ఖాళీ ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వీటిని పెద్ద ఎత్తున పెంచాలని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందని,స్థానిక ఎమ్మెల్యేల నుంచి బస్సు సర్వీసుల ప్రతిపాదనలు తీసుకొని అందించాలని, డిమాండ్ కు అనుగుణంగా అదనపు బస్సులను కేటాయిస్తామని, రాబోయే రోజులలో హైదరాబాద్ కు ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే నేపథ్యంలో జిల్లాలకు అదనపు బస్సులు అందుతాయని మంత్రి తెలిపారు. నగర పరిధిలో పీఎంఈ స్కీం కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూరల్ కనెక్టివిటీ బస్సుపై స్టడీ చేసి నూతన రూట్ లను ప్రతిపాదించాలని అన్నారు. లాండ్రీ లకు, దోబి ఘాట్, సెలూన్ లకు విద్యుత్ సరఫరా సజావుగా అందాలని అన్నారు. గురుకులాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళా చైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పల్నాడు పర్యటనలో అపశృతి

**పోలీస్ ఆంక్షలు బేఖాతర్ చేసిన జగన్**

**కాన్వాయ్ ఢీకొని ఒకరు...**

**సొమ్మసిల్లి మరొకరు మృతి**

**జగన్ తీరుపై సర్వత్రా విమర్శలు**



పల్నాడు**జూన్18ప్రజావినికిడి,**
మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. జగన్ పర్యటనలో అపశృతి చోటు చేసుకుని ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే జగన్ కాన్వాయ్ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందగా.. ఇప్పుడు మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సత్తెనపల్లి గడియారం స్తంభం వద్ద ఆ పార్టీకి చెందిన కార్యకర్త సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సత్తెనపల్లి కి చెందిన జయవర్ధన్ రెడ్డిగా గుర్తించారు. జయవర్ధన్ రెడ్డి సత్తెనపల్లిలో ఆటోమొబైల్ షాపును నిర్వహిస్తున్నాడు. అయితే క్లాక్ టవర్ వద్ద జగన్ రెడ్డి రాకతో ఒత్తిడి పెరిగింది. ఈ సమయంలో అక్కడే ఉన్న జయవర్ధన్ ఊపిరి ఆడక కిందపోయాడు. జగన్ కాన్వాయ్ వెళ్లాక వ్యక్తి పడిపోయి ఉండటాన్ని గుర్తించి తోటి కార్యకర్తలు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. కాగా.. బుధవారం ఉదయం ఏటూకూరులో సింగయ్య అనే వృద్ధుడిని వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న కాన్వాయ్ ఢీకొట్టింది. దీంతో అతడు మృతిచెందాడు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు భారీ కాన్వాయ్‌తో జగన్ బయలుదేరగా.. ఏటుకూరు బైపాస్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడు సింగయ్యను జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సింగయ్య మృతి చెందాడు. అయితే వృద్ధుడిని ఢీకొన్న తర్వాత కూడా జగన్, వైసీపీ నేతలు పట్టించుకోకుండా వెళ్లిపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. నిబంధనలకు విరుద్ధంగా వందలాది వాహనాలతో బలప్రదర్శన చేస్తూ జగన్ రెంటపాళ్ల వస్తుండగా.. ఇప్పటికి ఇద్దరు వ్యక్తులు మరణించారు. జగన్ తాడేపల్లి నుంచి సత్తెనపల్లి చేరుకుని రెంటపాళ్లకు వెళ్లకముందే ఇద్దరు చనిపోయిన ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జగన్ పర్యటనలో వంద మందికి మాత్రమే అనుమతి ఇస్తామని పోలీసులు చెప్పినప్పటికీ వందలాది వాహనాలతో, వేలాది మంది కార్యకర్తలతో తరలివచ్చి చావులకు కారణం అవడంపై సత్తెనపల్లితో పాటు పల్నాడు జిల్లాకు చెందిన ప్రజలు జగన్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# జమ్మూ కాశ్మీర్‌లో మూడో జోక్యం సహించం

## ట్రంప్‌కు స్పష్టం చేసిన ప్రధాని మోడీ -భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి




న్యూఢిల్లీ,**జూన్18ప్రజావినికిడి,**
జమ్మూ కాశ్మీర్ అంశంపై పాకిస్థాన్‌తో జరిపే చర్చల్లో మూడో పక్షం మధ్యవర్తిత్వం అవసరం లేదని.. అలా జరగాలని తాము కోరుకోవడం లేదని భారత్ కుండ బద్దలు కొట్టింది. ఈ విషయాన్ని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. జీ 7 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ కెనడా వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా యూఎస్ అధ్యక్షుడు ట్రంప్‌కు జమ్మూ కశ్మీర్ అంశంపై ఫోన్ ద్వారా ప్రధాని మోదీ స్పష్టం చేశారని ఆయన వివరించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని తొలుత తెరపైకి పాకిస్థాన్ తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా ట్రంప్‌కు ప్రధాని మోదీ గుర్తు చేసినట్లు వివరించారు. మంగళవారం రాత్రి ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారని చెప్పారు. ఆ క్రమంలో అపరేషన్ సిందూర్‌పై ట్రంప్ వివరాలు అడిగినప్పుడు.. అందుకు సంబంధించిన అంశాలను ఆయనకు ప్రధాని మోదీ సోదాహరణగా వివరించారని పేర్కొన్నారు. క్రమంలో జమ్మూ కశ్మీర్ విషయంలో మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేశారన్నారు. తద్వారా భారత్, పాకిస్థాన్ మధ్య పలు దఫాలుగా చర్చలు జరిపి.. ఇరుదేశాల మధ్య యుద్దాన్ని తానే నిలువరించా నంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు ప్రధాని మోదీ బలమైన సమాధానం ఇచ్చినట్లు అయిందని విక్రమ్ మిస్రీ వివరించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీ తొలిసారి జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాక్ అక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసి.. ఆ ప్రాంతాన్ని భారత్‌కు తిరిగి ఇవ్వాలని ఆయన స్పష్టం చేసిన విషయం విదితమే.ప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర ఆంక్షలు విధించింది. అదే తరహాలో పాకిస్థాన్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ సైన్యం దాడులు నిర్వహించి.. ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. అనంతరం పాక్ సైతం భారత్ భూభాగంలోని క్షిపణులు, డ్రోనులతో దాడులకు దిగింది. వీటిని భారత్ అడ్డుకున్న సంగతి తెలిసిందే.

# ఇజ్రాయిల్‌లో జగిత్యాల వాసి మృతి

జగిత్యాల,:ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాలు మధ్య జరుగుతున్న దాడుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ యుద్ధం వల్ల జగిత్యాలకు చెందిన రవీందర్ అనే వ్యక్తి మృతి చెందాడు. బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం రవీందర్ ఇజ్రాయెల్‌కు వెళ్లాడు. అయితే యుద్ధం జరుగుతుండగా.. బాంబు శబ్దం వల్ల రవీందర్ గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రవీందర్ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యుద్ధం కారణంగా విమాన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రవీందర్ మృతదేహాన్ని ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

------

# ఉపరాష్ట్రపతి ధన్‌కడ్‌తో లోకేశ్ భేటీ

## మర్యాదపూర్వకంగానే కలిసినట్లు వెల్లడి



న్యూఢిల్లీ,: ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ హోంమంత్రి అమిత్ షా, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌లతో భేటి అయ్యారు. బుధవారం ఉదయం నుంచి దేశ రాజధాని ఢిల్లీలో మంత్రి నారా లోకేష్ పర్యటన కొనసాగింది. ఉదయం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌తో మంత్రి భేటీ అయ్యారు. అయితే మర్యాద పూర్వకంగానే ఉపరాష్ట్రపతిని కలిసినట్లు లోకేష్ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అమరావతిలో నిర్మించ తలపెట్టిన అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు కొత్త భవనాల్లో కొన్నింటికి వైస్ ప్రెసిడెంట్‌తో శంకుస్థాపన చేయించాలని సీఎం చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఉపరాష్ట్రపతిని ఏపీకి రావాల్సిందిగా లోకేష్ ఆహ్వానించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మంత్రి లోకేష్‌తో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, బైరెడ్డి శబరి.. ఉపరాష్ట్రపతిని కలిశారు. పలువురు కేంద్రమంత్రులతో లోకేష్ సమావేశం కానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీకానున్నారు. ఇది చాలా కీలకమైన సమావేశం. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌లో ఏపీకి చెందిన నేతల ఫోన్లు కూడా ట్యాప్ అయినట్లు సమాచారం. దీనిపై ప్రధానంగా కేంద్రమంత్రితో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఏపీ లిక్కర్ కేసులో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర హోంమంత్రికి వివరించనున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాజీ సీఎం జగన్‌కు సంబంధించిన వ్యవహారాలపై ఎక్కువగా చర్చించి అవకాశం ఉన్నట్లు సమాచారం.

# 17మంది ఖైదీలకు విముక్తి

## సత్ప్రవర్తన మీద విడుదల చేస్తూ ఆదేశాలు

అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పలు జైళ్లలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తోన్న 17 మంది సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. జైళ్లశాఖ ఎంపిక చేసిన 17 మంది సత్ప్రవర్తన కలిగిన ఖైదీల జాబితా రూపొందించగా దాన్ని హోం శాఖ పరిశీలన అనంతరం మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 2025 ఫిబ్రవరి 1 వరకు నిర్ణీత కాలంలో శిక్ష అనుభవిస్తోన్న ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించారు. జీవిత ఖైదీల మిగిలిన శిక్షను షరతులకు లోబడి రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాల్లో తెలిపింది. ఖైదీల ముందస్తు విడుదలకు రూ.50 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని షరతు విధించింది. విడుదలైన తర్వాత ఖైదీలు శిక్ష పూర్తయ్యే వరకు పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. 3 నెలలకు ఒకసారి ప్రొబేషన్ అధికారి ముందు హాజరు కావాలని నిర్దేశించింది. విడుదలైన ఖైదీలు ఏదైనా నేరానికి పాల్పడితే తిరిగి అరెస్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాల్లో స్పష్టం చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# భారమైన చదువులు.. దూరమవుతున్న కలలు..!



## విద్య వ్యాపారంగా మారిన వైనం.

పేద మధ్యతరగతి వారికి భారంగా మారిన చదువు.

చదువుకునే స్థితి నుండి చదువుకొనే పరిస్థితికి దిగజారిన నేటి విద్యా విధానం.



### బంధీఖానాలుగా విద్యాలయాలు ఒత్తిడిలో విద్యార్థులు.



నేటి విద్యా వ్యవస్థలో పిల్లలు చదువుత్నోనాన్ని పొందక ఒత్తిడిలో జీవిస్తున్నారు

వారానికి 70%-%80 గంటల చదువు ఒత్తిడి

నీట్ , జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల కోసం ఆరవ తరగతి నుంచే "లాంగ్ టర్మ్" శిక్షణ

ప్రతిభ కన్నా మార్కుల పోటీ, వ్యక్తిత్వ అభివృద్ధికి అవకాశమే లేని కోచింగ్

చిన్న వయస్సులోనే వారిని పరీక్షల యంత్రాలుగా మలచిన ఈ విధానం%ొ% వారి బాల్యాన్ని హరించి, భావితరాల భవిష్యత్తును నిలువునా మార్చేస్తోంది. మానసికంగా వీలైనంత ఒత్తిడికి గురవుతున్న ఈ విద్యార్థుల్లో కొంతమంది తీవ్ర స్థాయిలో మానసిక దౌర్భాగ్యానికి కూడా లోనవుతున్నారు.అది వారిని విపరీత నిర్ణయాలు తీసుకునే విధంగా ఉసిగొల్పుతుంది.

**జూన్18ప్రజావినికిడి,**
ఒకవైపు ప్రభుత్వ ఉపాధ్యాయులు గవర్నమెంట్ బడులలో పిల్లలను చేర్చుకునేందుకు రోడ్డెక్కి ప్రచారం చేస్తుంటే, మరోవైపు తల్లిదండ్రులు కార్పొరేట్ విద్యాలయాల్లో సీటు కోసం లక్షల్లో అప్పులు చేసి క్యూలలో నిలబడుతున్నారు. ఇది ఎవరికి శాపం. ఒకప్పుడు విద్య సామాన్యుడికి ఆశ%ొ% పేదవాడికి ఆయుధం%ొ% మార్పు కోసం మార్గం. కానీ ఇప్పుడు అదే చదువు కొంతమందికి మాత్రమే అందే విలాస వస్తువుగా మారింది. ప్రభుత్వ వ్యవస్థ చేతులెత్తేయగా, కార్పొరేట్ వ్యవస్థ చేతిలో విద్య వ్యాపారంగా మారింది. చదువుకోవాలని ఆశ పడడం తప్పా చదువుకోవడం ఇప్పుడు పెద్ద పరీక్షగా మారిపోయింది.

**వ్యాపారంగా మారిన విద్యా రంగం.**
భారతదేశంలో విద్యా రంగం అత్యంత వేగంగా పెరుగుతున్న వాణిజ్య రంగాల్లో ఒకటి. 2024 నాటికి దేశంలోని విద్యా రంగ మార్కెట్ విలువ రూ.2 లక్షల కోట్లు దాటింది.

**కోచింగ్ ఇండస్ట్రీ విలువే రూ.58,000 కోట్లు!**
కార్పొరేట్ పాఠశాలల్లో సగటున ఏడాది ఫీజులు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటున్నాయి అవీ కాక

తల్లిదండ్రులు ఒక్కొక్క పిల్ల వాని పై నెలకు అదనంగా రూ.2,500 %-% రూ.10,000 వరకు ఖర్చు చేస్తున్నారు.

ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కాదు%ొ% ఇవి లక్షలాది మంది తల్లిదండ్రుల కలల సౌధాలు , చదువు ఇప్పుడు అభివృద్ధికి లక్ష్యంగా కాకుండా, అప్పుల భారంగా మారిపోయింది.

**అప్పుల్లో తల్లిదండ్రులు.**
తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివి , తమ పిల్లలు ఉన్నతస్థితిలో ఉండాలని మంచి ఉద్యోగంలో స్థిరపడాలని స్థాయికి మించి ఖర్చు చేస్తున్నారు

చదువు కోసం తమ స్థిరాస్తులను అమ్మేసే వారు కొందరైతే, సొంత ఊరిలో వ్యాపారాలను మూసేసి వలస వెళ్లే వారు ఇంకొందరు

నెలవారీ ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చుపెట్టి అప్పుల్లో కూరుకుపోతున్న ఎందరో!

ఒక సర్వే ప్రకారం దేశంలోని 58% తల్లిదండ్రులు తమ పిల్లల చదువు ఖర్చుల కోసం అప్పులు తీసుకుంటున్నారు. చదువు పేరుతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా పాతాళంలో పడిపోతున్నాయి. ఇవి వ్యక్తిగత బాధలు మాత్రమే కాదు సమాజాభివృద్ధిని తిరోగమనంలో పయనింపచేసే వాస్తవాలు

**ప్రభుత్వ పాఠశాలలు నమ్మకం కోల్పోయిన ప్రజలు.**
ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యలో ఉత్తమంగా ఉండేవి. కానీ రాను రాను వాటిపై అందరిలో నమ్మకం సన్నగిల్లింది ఇలా ప్రజల నమ్మకం తగ్గిపోవడానికి కొన్ని కారణాలుమౌలిక సదుపాయాల లోపంఉపాధ్యాయుల కొరత

నాణ్యతలేని బోధన2020 నుంచి 2024 మధ్య తెలంగాణలో 4,500 పైగా పాఠశాలలు మూతపడ్డాయి. ఆంగ్ల బోధన, డిజిటల్ సదుపాయాల లోపం వల్ల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలు వదిలి ప్రైవేట్ బాట పడుతున్నారు.

**కొన్ని పరిష్కార మార్గాలు.**
ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆంగ్ల బోధన

ఉపాధ్యాయుల నియామకం, శిక్షణ ప్రమాణాలు పెంచాలి

**ఫీజుల నియంత్రణ.**
ప్రైవేట్ పాఠశాలలపై గరిష్ఠ ఫీజు పరిమితులు విధించాలిఅక్రమ వసూలుపై కఠిన చర్యలు తీసుకోవాలి

**వృత్తి విద్యకు ప్రోత్సాహం.**
ఐటీఐ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి వృత్తి విద్యా కోర్సులలో చేరేందుకు ప్రోత్సహించాలి.

ద్యార్థులకు ప్లేస్మెంట్, స్టార్టప్ మద్దతు అందించాలి

కార్పొరేట్ పాఠశాలల్లో 25% సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలి

ప్రభుత్వ నిధులతో హాస్టల్ వసతి కల్పించాలి

బిపిల్లలపై ఒత్తిడిని తగ్గించాలి.

ఆనందదాయకమైన బోధన విధానాలు వుండాలి

మార్కులకు కాక అభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కోచింగ్-రేసు బదులు సృజనాత్మకతను ప్రోత్సహించాలి.

బ్రాండ్ పేరు చూసి కాకుండా పిల్లల ఆసక్తులు, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలి.

ప్రభుత్వాలు అందరికి నాణ్యమైన ఉచిత విద్య అందించినప్పుడే చదువులో సమానత్వం సాధ్యమవుతుందని

### చదువుతో ఉద్యోగం వస్తే సరి లేదంటే.?

ఇన్నాళ్లు చదివిన విద్య ఉద్యోగం కోసం కాదు అంటాం. కానీ యథార్థంలో మాత్రం చదివినా ఉద్యోగం లేకపోతే ఆ చదువు వ్యర్థమనిపించేది సహజం.ప్రతి సంవత్సరం 1.5 కోట్లమందికి పైగా విద్యార్థులు పాసవుతున్నారుకానీ అందుకు అనుగుణంగా ఉద్యోగావకాశాలు పెరగట్లేదు లక్షలాది యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు అందులో చాలా మంది మానసికంగా కుంగిపోతున్నారు జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు.

ఉద్యోగం లేకపోవడం ఒక వ్యక్తిగత సమస్య అనిపించవచ్చు. కానీ, లక్షల మందికి ఇదే సమస్య అయితే అది రాష్ట్రాల పాలన వైఫల్యంగా చూడాల్సిందే.

### విద్య వ్యాపారం కాదు అందరి హక్కు

విద్య అనేది అమ్మే వస్తువు కాదు. అది ప్రతి పౌరుడికి హక్కు. అది పేదవాడికి వెలుగు చూపే మార్గం. అదే విద్య ఒక కుటుంబాన్ని అప్పుల్లోకి నెట్టితే%ొ% అది అభివృద్ధి మార్గం కాదు, ప్రమాదానికి సంకేతంగా మారుతుంది. అందుకే ఇప్పుడు సమాజం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చదువు భారంగా కాకుండా%ొ% భవిష్యత్తును బలంగా నిర్మించుకునే శక్తి కావాలి. విద్యలో సమానత్వం, నాణ్యత, వుండాలి అప్పుడే కలలు కన్న ప్రతి విద్యార్థి ఆశల అక్షరాన్ని చేరుకుంటాడు.

అందరూ గొప్పగా చెప్పుకోవడానికి తల్లిదండ్రులు తమ ఇష్టానికి అప్పులు చేసి చదివించడం కంటే పిల్లల సామర్థ్యాన్ని ఇష్టాన్ని బట్టి చదివిస్తేనే వాళ్ళు ఒత్తిడికి లోనవకుండా ఉన్నతస్థాయికి వెళ్ళగలరు..

---

# ఆపరేషన్ కగార్‌దే పైచేయి !

**జూన్18ప్రజావినికిడి,**
ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. మొత్తంగా అగ్రనేతలు అంతా హతమువుతన్నారు. కేంద్రం ఏదైతే కోరుకుంటందో అదే జరుగుతోంది. నిజానికి పీపుల్స్ వార్ రాకతోనే గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ అంతరించింది. దొరల సామ్రాజ్యానికి చెక్ పడింది. గడీల పాలన అంతమొందింది. ఊర్లో భూస్వాముల అఘాయిత్యాలు ఆగాయి. రాజకీయ నేతల దూకుడు తగ్గింది. ఏదైనా పనిచేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. కానీ ఇప్పుడు రాజకీయ నాయకుల పెత్తనం పెరిగింది. భయమన్నది లేకండా పోయింది. అఇకారంలోకి వచ్చి భూములను కబ్జా చేస్తున్నారు. అప్పనంగా అమ్ముకుంటున్నారు. తప్పుడు పనులు చేసే రాజకీయ నాయకులకు, బూకబ్జాదారులకు పీపుల్స్ వార్ హయాలో భయం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే దళాలను చుట్టుముట్టి మట్టుబెడుతున్న కారణంగా మావోలు అంతరించి పోతున్నారు. ముఖ్యంగా మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా ఉంది. మావోలపైనే ఎందుకనో దూకుడుగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరి స్తోందని మహాధర్నాలు పలువురు నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని పలువురు విమర్శించారు.



అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న వారు గళమెత్తారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని కూడా అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్య నైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని ,నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే..ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోలతో చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమన మేనని శాశ్వత పరిష్కారం కాదని గుర్తు చేశారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ,అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా ..నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని కూడా విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే అని విమర్శించారు. మొత్తంగా ఇప్పుడు కేంద్రం అనుకున్న విధంగా మావోలు అంతమొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అయితే దోపిడీ ఉన్నంతకాలం పోరాటం ఉంటుంది. రాజకీయ దోపిడీ ఉంటే తిరుగుబాటు తప్పదని చరిత్ర రుజువు చేసింది. రాజకీయ దోపిడీని అరికట్టాలి. జబ్బుకు చికిత్స చేయడం కన్నా అసలు జబ్బులే రాకుండా నిరోధించ గలగడం ముఖ్యమని వైద్యశాస్త్రంలో చెబుతారు. అందుకోసం కృషి చేయడం మంచిది. సమాజంలో ఉత్పన్నమయ్యే అశాంతికి, ఇతర సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం మావోలను అణచివేస్తే సమస్య సమిసి పోదని గుర్తించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రజలు అసంతృప్తితో చేసే ఆందోళనలపై ప్రభుత్వం తమ బలాన్ని, బలగాలను ప్రయోగించడం వల్ల లాభం లేదు. ఉద్యమాలను, ఆందోళనలను ప్రతిష్ఠగా తీసుకొని ఎంత గొప్పగా వాటిని అణచివేశామో చెప్పుకోవడం సరికాదు. మార్చి 31 వరకు సంపూర్ణంగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుతం ఎక్కడైతే కేంద్రీకరించి పని చేస్తుందో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి వారిని మట్టుపెడుతున్న తీరుతో వారు అంతమొందడం ఖాయం కానీ...ప్రజల్లో గూడుకట్టుకున్న ఆందోళనలను మాత్రం అణచివేయడం సాధ్యం కాదని గుర్తించాలి.

# కొత్త ఫార్ములాని ఫాలో అవుతున్న ఉస్తాద్ రామ్!



ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ తరువాత రామ్ ఆ స్థాయి సక్సెస్‌ని సొంతం చేసుకోలేకపోతున్నాడు. లింగుస్వామితో చేసిన 'ది వారియర్', బోయపాటి శ్రీనుతో చేసిన 'స్కంద', పూరిజగన్నాథ్‌తో చేసిన 'డబుల్ ఇస్మార్ట్' వరుసగా ఫ్లాప్ కావడంతో కొంత ఆలోచనలో పడిన రామ్ తన పంథా మార్చుకున్నాడు. ఇస్మార్ట్ శంకర్ మూవీ నుంచి యాక్షన్ బాటపట్టిన రామ్ అది వర్కవుట్ కాకపోవడం, వరుస ఫ్లాపులు ఎదురవుతుండటంతో ఫైనల్‌గా తన రూటు మార్చుకున్నాడు.

యాక్షన్ ఎంటర్ టైనర్‌లతో చేతుల కాల్చుకున్న రామ్ వెంటనే తేరుకుని తనదైన మార్కు రొమాంటిక్ లవ్ స్టోరీలనే చేయాలి, అందులోనూ సెన్సిబుల్ మూవీస్ మాత్రమే చేయాలని నిర్ణయించుకున్నాడట.

ఈ మార్పులో భాగంగానే ప్రస్తుతం 'ఆంధ్రా కింగ్ తాలూకా' మూవీని చేస్తున్నట్టుగా తెలిసింది. ఇందులో కన్నడ హీరో ఉపేంద్ర సూపర్ స్టార్‌గా కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.

ఇటీవలే ఫస్ట్‌లుక్‌తో పాటు టీమ్ గ్లింప్స్‌ని కూడా రిలీజ్ చేసి సినిమాపై అంచనాల్ని పెంచేసింది. మాస్ ఎలిమెంట్స్‌తో సాగే ఎమోషనల్ లవ్ డ్రామాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచి రామ్ కొత్త ఫార్ములాని ఫాలో అవుతున్నట్టుగా తెలుస్తోంది. డబుల్ ఇస్మార్ట్ మూవీ వరకు రూ.25 నుంచి రూ.30 కోట్ల వరకు పారితోషికాన్ని డిమాండ్ చేసిన రామ్ 'ఆంధ్రా కింగ్ తాలూకా' కు మాత్రం ఆ స్థాయిలో డిమాండ్ చేయడం లేదట. ఈ సినిమాకు కొత్త పద్దతిని పాటిస్తున్నాడట. ఈ సినిమాకు రూ.10 కోట్లు మాత్రమే పారితోషికం తీసుకుంటున్న రామ్ మిగతా మొత్తాన్ని సినిమా లాభాల్లో వాటాని తీసుకుంటున్నాడట. ఇదే ఒప్పందాన్ని నిర్మాతలు రామ్‌తో చేసుకున్నట్టుగా ఇన్ సైడ్ టాక్. ఈ మూవీని మైత్రీమూవీ మేకర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే సినిమాల నిర్మాణంలో కొత్త పంథాని పాటిస్తున్న మైత్రీ వారు రామ్‌తో ఈ సినిమా కోసం ప్రాఫిట్ అండ్ షేర్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారట. మహేష్ బాబు పి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో రామ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది.

# లేడీ క్వీన్‌తో సంయుక్త డేరింగ్ ఎంట్రీ!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన యాక్షన్ ఎమోషనల్‌డ్రామా భీమ్లానాయక్. త్రివిక్రమ్ దర్శకత్వ పర్యవేక్షణలో సాగర్ కె. చంద్ర డైరెక్ట్ చేసిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కోవిడ్ టైమ్‌లోనూ ఏ స్థాయిలో సందడి చేసిందో అందరికి తెలిసిందే. ఇదే మూవీతో తెలుగు తెరకు ఎంట్రీ ఇచ్చింది మలయాళ సోయగం సంయుక్తమీనన్. ఆ తరువాత కల్యాణ్ రామ్ బింబిసార, డెవిల్, ధనుష్ సార్, సాయి ధరమ్ తేజ్‌తో విరూపాక్ష చిత్రాల్లో నటించి వరుస విజయాలతో క్రేజీ హీరోయిన్‌గా పాపులారిటీని సొంతం చేసుకుంది.! ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీనుల కలయికలో రూపొందుతున్న అఖండ 2లో నటిస్తోంది. దీనిపై భారీ అంచనాలే ఉన్నాయి. నిఖిల్‌తో స్వయంభులోనూ నటిస్తున్న సంయుక్త తాజాగా క్రేజీ ఆఫర్‌ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. వెర్సటైల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న పూరి జగన్నాథ్ డైరెక్షన్‌లోనూ నటించే ఆఫర్‌ని దక్కించుకుంది. విజయ్ సేతుపతి హీరోగా పూరి ఓ భారీ యాక్షన్, ఎమోషనల్ డ్రామాని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో టాబుతో పాటు సంయుక్త మీనన్ కూడా కీలక పాత్రలో కనిపించబోతోంది. ఇవన్నీ పక్కన పెడితే సంయుక్త ఈ ఏడాది డేరింగ్ స్టెప్‌కు రెడీ అయిపోయింది. అదే బాలీవుడ్ ఎంట్రీ. బాలీవుడ్‌లో క్రేజీ కథానాయికగా పేరు తెచ్చుకున్న కాజోల్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ని దూకుడుగా ప్రారంభించి వరుసగా లేడీ ఓరియెంటెడ్ సినిమా చేస్తోంది. ఇప్పటికే కాజోల్ నటించిన పవర్‌ఫుల్ లేడీ ఓరియెండెట్ ఫిల్మ్ మా రిలీజ్‌కు రెడీ అవుతోంది. జూన్ 27న ఈ మూవీని భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. దీనితో పాటు కాజోల్ మరో పవర్ ఫుల్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అదే మహారాగ్ని : క్వీన్ ఆఫ్ క్వీన్స్. ఈ సినిమాతో తెలుగు యువకుడు చంద్రన్ తేజ్ ఉప్పలపాటి దర్శకుడిగా బాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడు. ప్రభుదేవా, నసీరుద్దీన్ షా, జిస్సుసేన్ గుప్తా కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ ద్వారా సంయుక్త మీనన్ బాలీవుడ్‌కు గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతోంది. ఇందులో కాజోల్ కూతురిగా సంయుక్త కనిపించబోతోంది. హిందీలో రూపొందుతున్న ఈ మూవీని తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు.



# నటుడు ఆర్య ఇంట్లో ఐటీ దాడులు



చెన్నైలోని "సీ షెల్" రెస్టారెంట్లపై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు బుధవారం ఉదయం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ రెస్టారెంట్ చైన్‌తో గతంలో సంబంధాలున్న ప్రముఖ తమిళ నటుడు ఆర్య నివాసంలోనూ ఏకకాలంలో సోదాలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అన్నా నగర్, వేలచ్చేరి సహా నగరంలోని పలు "సీ షెల్" రెస్టారెంట్ శాఖలలో ఉదయం నుంచే ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఈరోజు ఉదయం ఐటీ అధికారుల బృందాలు "సీ షెల్" రెస్టారెంట్ల కార్యాలయాలు, శాఖలకు చేరుకున్నాయి. అన్నా నగర్ బ్రాంచ్‌లో ఐదుగురికి పైగా అధికారులు రెండు వాహనాల్లో ఉదయం 8 గంటలకు చేరుకుని తనిఖీలు ప్రారంభించినట్లు తెలిసింది. పోలీసుల బందోబస్తు నడుమ ఐటీ అధికారులు ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో పూనమల్లి హై రోడ్ లో ఉన్న నటుడు ఆర్య నివాసంలో కూడా మరో ఐటీ బృందం సోదాలు చేపట్టింది. గతంలో నటుడు ఆర్య ఈ అరేబియన్ రెస్టారెంట్ చైన్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత ఆర్య ఈ రెస్టారెంట్లను కేరళకు చెందిన కున్హి మూసా అనే వ్యాపారవేత్తకు విక్రయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే కేరళలో కున్హి మూసాకు సంబంధించిన ఆస్తులపై ఐటీ శాఖ నిఘా పెట్టిందని, ఆ విచారణలో భాగంగానే చెన్నైలోని ఈ రెస్టారెంట్లు, ఆర్య నివాసంపై దాడులు జరుగుతున్నాయని భావిస్తున్నారు. ప్రధానంగా రెస్టారెంట్ ఆర్థిక లావాదేవీలు, యాజమాన్య మార్పులకు సంబంధించిన అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నటుడు ఆర్య కేరళకు చెందినవాడైనప్పటికీ, "అరిన్తుమ్ అరియామలుమ్" సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసి, పలు విజయవంతమైన చిత్రాలతో స్టార్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఆయన పా. రంజిత్ దర్శకత్వంలో "వెట్టువమ్" చిత్రంలో నటిస్తున్నారు. ఈ దాడులకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏపీ హైకోర్టులో 'కన్నప్ప'కు ఊరట



మంచు మోహన్ బాబు, విష్ణు నిర్మించి, నటించిన కన్నప్ప చిత్రంలోని సన్నివేశాలు, పాత్రల పేర్లు బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు వెంకట శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై నిన్న ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ నెల 27న చిత్రం విడుదల కానున్నందున ఆ ప్రక్రియను నిలువరించాలని కోరారు. ఇందుకు అంగీకరించని హైకోర్టు.. ప్రతివాదులైన కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీబీఎఫ్ సీ, సీఈవో, సీబీఎఫ్ సీ ప్రాంతీయ కార్యాలయ అధికారి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, దర్శకుడు ముఖేష్ కుమార్, నటులు మోహన్ బాబు, విష్ణు, కన్నెగంటి బ్రహ్మానందం, పి. వెంకట ప్రభుప్రసాద్, సప్తగిరిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేసింది. సినిమా విడుదల అయ్యాక అభ్యంతరకర విషయాలు ఉంటే తొలగించేలా ఆదేశిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీంతో కన్నప్ప చిత్రం విడుదలకు హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టయింది.

# '8 వసంతాలు' అలాంటి కథే: డైరెక్టర్ ఫణీంద్ర




పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన '8 వసంతాలు' ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించారు. అనంతిక సునీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్‌ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. "ఒక బలమైన స్త్రీ పాత్ర చుట్టూ కథను చెప్పాలని అనిపించింది. మా అత్తయ్యలు, ఇంట్లో, చుట్టుపక్కల చాలా బలమైన స్త్రీ పాత్రల మధ్య పెరిగాను. ఎప్పటినుంచో ఆ దృక్కోణం ఉంది. ఈ ఫిల్మ్ తో ఒక పూర్ణస్థాయి తీసుకోవాలనిపించింది. నేను రాసుకున్న పాత్రకు అనంతిక సరిగ్గా సరిపోయింది. కేవలం నటిగానే కాదు, దాదాపు 13 కళలలో ఆమెకు ప్రవేశం ఉంది. తనకి మార్షల్ ఆర్ట్ వచ్చు. శుద్ధి అయోధ్య పాత్రకు ఆమె పూర్తి న్యాయం చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన హుందాతనాన్ని కోల్పోకుండా ఉండే అమ్మాయి ప్రయాణం ఇది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆమె నిలదొక్కుకుంటుంది. ప్రేమ రెండు దశల్లో జరుగుతుంది. 19 ఏళ్లలో జరిగే ప్రేమ, 27 ఏళ్ల వయసులో జరిగే ప్రేమలో తనలో మానసికంగా ఉన్న తేడాను చాలా సున్నితంగా చూపించాలని అనుకున్నాను. హీరోయిన్ పాత్ర ఎన్ని కష్టాలు వచ్చినా మృదుత్వాన్ని కోల్పోదు. ఈ సినిమాను కాశ్మీర్, కన్యాకుమారి, ఊటీ, ఆగ్రా.. ఇలా చాలా అద్భుతమైన లోకేషన్స్‌లో షూట్ చేశాం. కథే సినిమాను అక్కడికి తీసుకెళ్లింది"అని అన్నారు.

# మారుతి నెక్స్ట్ టార్గెట్ బన్నీ-చరణ్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో మారుతి సినిమా 'రాజాసాబ్' తీయడం అన్నది ఊహించనది. అనుకోకుండా ఈ కాంబినేషన్ సెట్ అయింది. కామెడీ నేపథ్యం గల హారర్ చిత్రాలను ప్రభాస్ లైక్ చేసే హీరో కావడంతో మారుతికి ఈ ఛాన్స్ దక్కిందన్నది కాదనలేని వాస్తవం. ఈ కాంబినేషన్ లో సినిమా ప్రచారం మొదలైన కొత్తలో కొన్ని విమర్శలు కూడా తెరపైకి వచ్చాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మారుతితో ఏ తరహా సినిమా తీస్తాడు? అన్నది ప్రధానంగా హైలైట్ అయింది. మెగా కాంపౌండ్ కు చెందిన మారుతి కి బన్నీ అవకాశం ఇవ్వకుండా ప్రభాస్ ఛాన్స్ ఇవ్వడం ఏంటనే సందేహం కూడా వ్యక్తమైంది. కారణాలు ఏవైనప్పటికీ మారుతికి దర్శకుడిగా మంచి అవకాశం ఇది. 'రాజా సాబ్' సక్సెస్ అన్నది అతడిని స్టార్ డైరెక్టర్ల జాబితాలో నిలబెట్టే చిత్రమవ్వాలి. ఇంత వరకూ మారుతి స్టార్ డైరెక్టర్ల జాబితాలో స్థానం సంపాదించని సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ కొంత మంది దర్శకులు మాత్రమే ఆ రేసులో ఉన్నారు. వాళ్లతోనే రామ్ చరణ్, ఎన్టీఆర్, బన్నీ, మహేష్ లాంటి స్టార్ హీరోలు సినిమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి స్టార్లతో మారుతికి అవకాశాలు రావాలంటే రాజాసాబ్ సక్సెస్ అన్నది అత్యంత కీలకం. ప్రభాస్ పాన్ ఇండియా మార్కెట్ 2000 కోట్లపైనే. కానీ రాజాసాబ్ యూనివర్సల్ కాన్సెప్ట్ కాదు కాబట్టి ప్రభాస్ మార్కెట్ ఆధారంగా బేరీజు వేయడానికి లేదు. ఈ నేపథ్యంలో మారుతి తన కథా బలం...ప్రభాస్ ఇమేజ్ తో మెప్పించగలిగి మంచి వసూళ్లు సాధించిన చిత్రంగా అందించాలి. ఈ సినిమా బడ్జెట్ 400 కోట్లు అంటున్నారు. అలాగైతే సినిమా 1000 కోట్లు రాబట్టి. అప్పుడే మారుతి స్టార్ డైరెక్టర్ల లీగ్ లో చేరేది. బన్నీ...చరణ్ లతో సినిమాలు తీయాలన్నది మారుతికి ఎప్పటి నుంచో ఉన్న కల. ఆ కల సాకార మవ్వాలంటే? రాజాసాబ్ సక్సెస్ అత్యంత కీలకం

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613